లోతుగెడ్డ ప్రభుత్వ పాఠశాలలో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-చింతపల్లి : మండలంలోని లోతుగెడ్డ ప్రభుత్వ బాలుర ఆశ్రమ పాఠశాలలో పాడేరు శాసనసభ్యుడు మత్స్య రాస విశ్వేశ్వర రాజు ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులతో పాఠశాలలో జరుగుతున్న విధి విధానాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు పాఠాలు సరిగ్గా చెబుతున్నారా, మెనూ సక్రమంగా అమలవుతుందా అని శాసన సభ్యులు అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు, వసతి గృహ అధికారితో ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో నైపుణ్యాన్ని బట్టి పాఠాలు బోధించాలని అదే క్రమంలో వారికి ఏ రంగంపై ఆసక్తి ఉందో గమనించాలన్నారు, మెనూ పట్టిక ప్రకారం విద్యార్థులకు భోజనాలు పెట్టాలని, వసతి సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

దారకొండ కేంద్రంగా అక్రమ మద్యం

విశాలాంధ్ర-జీకే వీధి : ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మద్యం టెండర్లను నిర్వహించిన సంగతి తెలిసిందే. అందులో సీలేరు మద్యం దుకాణాన్ని లాటరీ పద్ధతిలో కైవసం చేసుకున్న వ్యాపారి ముందుగా దారకొండ గ్రామంలో వినాయకుని దేవాలయానికి ఆనుకొని ఉన్న బడ్డీ షాపులో ఒక లోడ్ మద్యం సీసాలను దించినట్టు తెలిసింది. అక్కడ నుంచి దారకొండ, గుమ్మిరేవుల పంచాయితీలలో గల గ్రామాలకు అలాగే తూర్పుగోదావరి జిల్లా గుర్తేడు పరిసర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకోవడానికి బెల్ట్ షాపుల ద్వారా ఎక్కువ మొత్తం లో మద్యం సీసాలను దించి వాటిని గిరిజనులకు అధిక రేట్లకు విక్రయించడానికి సన్నాహాలు చేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. దారకొండలో ఒక యువకుడి ద్వారా ఇదంతా జరిపించేందుకు వ్యాపారి ప్రయత్నం చేస్తున్నాడు. దేవాలయాలకు, ప్రభుత్వ కార్యాలయాలకు దూరంగా ఉండాల్సిన మద్యం దుకాణాలు పాఠశాలకు 20 మీటర్ల దూరం,దేవాలయం గోడకు ఆనుకోని మద్యం విక్రయాలు చేపడితే చూస్తూ ఊరుకోమని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

రోడ్డు సౌకర్యం లేక గర్భిణీలకు తప్పని డోలీ కష్టాలు

ఐదు కిలోమీటర్ల డోలీ మోతతో తరలింపు

విశాలాంధ్ర-అనంతగిరి : కనీస రోడ్డు సౌకర్యాలు లేక మారుమూల గిరిజన గ్రామాల గర్భిణీ స్త్రీలు, రోగులకు డోల్లీ కష్టాలు తప్పడం లేదు, మండలంలోని గుమ్మ పంచాయతీ మారుమూల కర్రిగోడ గ్రామానికి చెందిన బడ్నాయిని, రాములమ్మ గర్భిణీ స్త్రీ కు శనివారం పురిటి నొప్పులు మొదలై అయితే కుటుంబ సభ్యులు వైద్యం నిమిత్తం గర్భిణీని కర్రలో కట్టి డోల్లీ సహాయంతో ఎత్తయిన కొండలు అటవీ మార్గం మధ్యసుమారు ఐదు కిలోమీటర్ల దూరం భుజానమోసి తరలించారు, పంచాయతీ కేంద్రం గుమ్మ వరకు చేర్చి అక్కడ నుండి ప్రైవేటు ఆటోలో ఎస్ కోట ఏరియా ఆసుపత్రులకు తరలించినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు, కర్రి గోడ, కడరేవు, నుంచి నాటక మార్గంలో సుమారు అయిదు గిరిజన గ్రామాలు ఉన్నాయి అయితే ఈ గ్రామాలకు చెందిన గర్భిణీ ఇతర రోగులకు అత్యవసర పరిస్థితిలో వైద్య సేవ కోసం లుంగపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రైవేటు ఆసుపత్రులకు షేర్చాలన డోల్లీ సహాయంతోనే నాన్న అష్ట కష్టాలు పడి వైద్యం కోసం తీసుకెళ్లవలసి వస్తుంది ఇది ఇలా ఉన్నప్పటికీ పాడేరు కనెక్టివిటీ ప్రాజెక్టు కింద 2020-21 సంవత్సరంలో కోట్ల రుపాయలు నిధులు మంజూరు కాగా సంబంధిత అధికారులు గుమ్మ గ్రామం నుండి పనులు మొదలుపెట్టి మూడు కిలోమీటర్లు చేపట్టగా ఫారెస్ట్ అధికారులు ఆటంకంతో రోడ్డు పనులు నిలిచిపోయాయి. దీంతో ఆ గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు ఇప్పటికైనా ఈ రహదారి పని పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కాఫీ కార్మిక సంఘంతో ఏపీఎఫ్‌డిసి అధికారుల చర్చలు విఫలం

చూస్తాం చేస్తాం అనే దాటవేత వైఖరి సరికాదు.. కాఫీ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు చిన్నయ్య పడాల్

విశాలాంధ్ర-చింతపల్లి : కాఫీ కార్మిక సంఘంతో శనివారం ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి సంస్థ (ఏపీ ఎఫ్ డీ సి) అధికారుల చర్చలు విఫలమయ్యాయని, చూస్తాం, చేస్తాం అనే అధికారుల దాటవేత వైఖరి సరికాదని కాఫీ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి సంస్థ పాడేరు, చింతపల్లి డివిజనల్ మేనేజర్లు కన్నబాబు, రత్న దీపిక, మాజీ డివిజనల్ మేనేజర్ మహేశ్వరరావులతో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్.కనకవల్లి, ఎల్ సుందరరావు, ప్లాంటేషన్ హెల్పర్స్ వెంకటేష్ రాజారావు పాపారావు లతో కలసి జరిపిన చర్చలు ఫల ప్రదం కాలేదు. దీంతో అధికారుల దాటవేత వైఖరిని నిరసిస్తూ కాఫీ కార్మికుల సంఘం సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేస్తాం మళ్లీ కలుద్దాం, కాఫీ చర్చల్లో ఇది ప్రాథమిక అంశమని, ఇలాగైతే సమ్మె తప్పదని కాఫీ కార్మిక సంఘం హెచ్చరించింది. మూడు గంటల పాటు కార్మికులు పెట్టిన పది డిమాండ్ల పై ప్రాథమికం గా చర్చల్లో ఎటువంటి పురోగతి కనిపించలేదు. వీడీఏ పాయింట్లు ఆధారంగా కూలి, పళ్లరేట్లు పెంపు, తగినంతమంది హెల్పర్లను నియమించి జీతాలు పెంపు తప్ప, మిగతా డిమాండ్లు చూస్తాం, చేస్తాం అనే అధికారుల వైఖరి పై ఉన్నత అధికారులకి నివేదిస్తామని కార్మిక సంఘం తెలిపింది. ఈచర్చల్లో కార్మికులకు సంస్థ అధికారులు ఎటువంటి భరోసా కలిగించలేక పోయారని కార్మిక సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. నివాస గృహాలు మరమ్మతులు చేస్తామని, బడ్జెట్ తయారుచేసి పంపిస్తామని అన్నారు. నెలకు 26 రోజులు పని దినాలు కల్పించలేని పక్షంలో రోజు కూలి ఇవ్వాలని కాఫీకార్మిక సంఘం డిమాండ్ చేసింది. హెల్పర్లకు గుర్తింపు కార్డులు ఇవ్వటానికి అంగీకరించింది, ప్లాంటేషన్ కండక్టర్ పీసీ 300 మందిని నియమిస్తే తప్ప తోటలు సంరక్షణ సాధ్యం కాదని కార్మిక సంఘం ప్రతినిధులు తేల్చి చెప్పారు, కూలి రేట్లు, పండ్ల రేట్లు తేల్చితే తప్ప కార్మికులు అంగీకరించబోరని, అవసరమైతే సమ్మెకు వెనకడ బోరని ఈసందర్భంగా కార్మిక సంఘం తేల్చి చెప్పింది. కార్మికుల సమస్యలు, చర్చల వైఫల్యాన్ని రీజనల్ మేనేజర్ దృష్టికి తీసుకువెళ్లి మళ్లీ పరిష్కరించుకునే ప్రయత్నం చేస్తామని చిన్నయ్య పడాల్ చెప్పారు.

ఇండియన్ గ్యాస్ సిబ్బంది అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడ రాధాకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సూపర్ సిక్స్ హామీలలో భాగంగా ఉచిత గ్యాస్ ఈకేవైస్ చేసుకోవాలంటే, గెస్ పైపు రూ. 200 రూపాయలు ఇచ్చి కొనవలసిందే నంటూ ముక్కు పిండి వసూలు చేస్తున్న పాడేరు ఇండియన్ గ్యాస్ అధికారులు పై చర్యలు తీసుకోవాలని ఏపీ గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడా రాధాకృష్ణ కోరారు. గ్యాస్ లబ్ధిదారుడికి తనకు అవసరం ఉన్నా లేకపోయినా ,డబ్బులు ఉన్నా లేకపోయినా 200 రూపాయలు పెట్టి పైపు కొంటే గాని ఈ కేవైసీ చేయబోమని పాడేరు ఇండియన్ గ్యాస్ అధికారులు చెబుతుంటే పాపం ఏం చేయలేని దిక్కుతోచని పరిస్థితుల్లో 200 రూపాయలు లబ్ధిదారులు కట్టవలసిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆదివాసుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని గతంలో కూడా ఉచిత గ్యాస్ కనెక్షన్ల పేర్లతో అక్రమ వసూళ్లకు పాల్పడ్డారని, కానీ నేటి వరకు సంబంధిత గ్యాస్ గోడౌన్ అధికారులను చర్యలు తీసుకోకపోవడం గమనార్హం అన్నారు. పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో నడుస్తున్న ఇండియన్ గ్యాస్ గోడౌన్ అక్రమాలకు నిలయంగా మారిందని ఈ విషయం అనేకమార్లు అధికారులు దృష్టికి వెళ్లిన చర్యలు తీసుకోకపోవడం చాలా దుర్మార్గమని అన్నారు. ఈ కేవైసీ కోసం పిలిచి 200 రూపాయలు గేస్ పైపు కొంటే గాని ఈ కేవైసీ చేయని అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గిరిజన ప్రాంత డిఈడి, బిఈడి అభ్యర్థులకు న్యాయం చేయండి

జీవో నెంబర్ 3 పునరుద్ధరణ చర్యలు చేపట్టండి

మంత్రి లోకేష్‌కి పర్యాటక శాఖ డైరెక్టర్ కిల్లు వెంకట రమేష్‌నాయుడు వినతి

విశాలాంధ్ర-జిమాడుగుల : ఐటీ శాఖ, విద్యాశాఖ మంత్రి లోకేష్‌ని పర్యాటక శాఖ డైరెక్టర్ కిల్లు వెంకట రమేష్‌నాయుడు విశాఖపట్నం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కలిశారు. మంత్రి నారా లోకేష్ తెదేపా నాయకులతో, కార్పొరేటర్లతో వివిధ రకాల అభివృద్ధి అంశాలు చర్చించిన అనంతరం కిల్లు వెంకట రమేష్ నాయుడు మాట్లాడుతూ ఐటిడిఏ ప్రాంతాల్లో ఉన్న డిఈడి, బిఈడి చేసిన అభ్యర్థులు గత ఐదు సంవత్సరాలుగా ఉద్యోగ నోటిఫికేషన్ లేక ఎన్నో అవస్థలు పడుతున్నారు. మన ప్రభుత్వం వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ ఫైల్ పైన చంద్రబాబు సంతకం చేసియున్నారు. గిరిజన ప్రాంతంలో మన ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 3ను 2020 ఏప్రిల్ 19న సుప్రీంకోర్టు రద్దు చేసింది. తెలుగుదేశం ప్రభుత్వం జీవో నెంబర్ 3 విడుదల చేసి ఐటిడిఏ పరిధిలో 16 శాఖల్లో ఉన్న 36 రకాల ఉద్యోగాలకు అవకాశం స్థానిక గిరిజనులకి ఉండేది. ఐటీడీఏ ఉన్న ప్రాంతాల్లో గిరిజన అభ్యర్థులు నూటికి 95 శాతం మంది ఉన్నారు. జీవో నెంబర్ 3ను పునరుద్ధరణ చేసి లేదా ప్రత్యామ్నామయ జీవో తీసుకువచ్చి గిరిజన ప్రాంత నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు స్థానికంగా కల్పిస్తారని కోరుతున్నాము. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం త్వరలో ఇవ్వనున్న మెగా డీఎస్సీ నోటిఫికేషన్ లో గిరిజన ప్రాంత అభ్యర్థులకు 100%కు 100% శాతం రిజర్వేషన్ కల్పించే విధంగా చర్యలు చేపట్టి గిరిజన ప్రాంతంలో డిఈడి, బిఈడి అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు.

భూసార సంరక్షణతో రైతులకు మేలు : కలెక్టర్ దినేష్‌కుమార్

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : భూసార రక్షణ చర్యలు చేపడితే రైతులకు మేలు జరుగుతుందని కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ పేర్కొన్నారు. వాసన్, రెయిఫారెస్ట్ ఎలియన్స్, రైతు సాధికార సంస్థల ఆధ్వరం లో జీవ వైవిధ్యభరిత సుస్థిర వ్యవసాయ విధానలు భూవనరుల యాజమాన్య పద్దతులపై శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన వర్కుషాపులో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి క్షీణతకు సంబంధించిన సమస్యలు, సవాళ్లను అధిగమించాలని అన్నారు. సామాజిక సాంస్కృతిక వ్యవస్థలను బలోపేతం చేయాలని అన్నారు. సూక్ష్మ ప్రకృతి వ్యసాయాన్ని ప్రోత్సహించాలని సూచించారు. ఆర్ ఓ ఎఫ్ ఆర్ భూములో ల్యాండ్ స్కేప్ మేనేజ్మెంటు పనులు చేపట్టాలని స్పష్టం చేసారు. డ్వామా ఆధ్వర్యంలో ల్యాండ్ స్కేపింగ్ పనులు నిర్వహించాలని ఆదేశించారు. రైతు ఉత్పత్తి దారుల సంఘాలను ఏర్పాటు చేస్తామన్నారు. జీవ వైవిధ్యంతో భూ సంరక్షణ అధికంగా పెరుగుతుందన్నారు. భూసారం పెరగడం వలన రైతులు అధిక దిగుబడులు సాధిస్తారని అన్నారు. నీటి యాజమాన్య పద్ధతులను అవలంభించాలని సూచించారు. పశు సంపద, మత్స్య సంపద పెరగడానికి వ్యవసాయానుబంధ శాఖలు తగిన చర్యలు చేపట్టాలన్నారు. సహజ పర్యావరణ పరిరక్షణతో పాటు వ్యవసాయ విస్తరణ జరగాలని చెప్పారు. గ్రామ సచివాలయం పరిధిలోని వ్యవసాయ భూములను గుర్తించాలని చెప్పారు. భూముల గుర్తింపు, రైతులు సాగు చేస్తున్న వ్యవసాయ పంటల నమోదు చేయడానికి సచివాలయం సిబ్బందితో కమిటీలు నియమించాలని స్పష్టం చేసారు. నీటి సంరక్షణ పనులు నిర్వహించడానికి ఇద్దరు రిసోర్సు పర్సన్లను తయారు చేయాలని అన్నారు. వివిద స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న వ్యవసాయ సహాయక చర్యలను సంబంధిత సంస్థల ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. స్వయం సహాయ సంఘాల సభ్యులకు రూ.800 కోట్ల వ్యవసాయ రుణాలు అందించడం జరిగిందన్నారు. రైతులు అధిక దిగుబడులు సాధించే విధంగా ప్రోత్సహించాలని చెప్పారు. పర్యావరణ పరిరక్షణ కు అందరూ కృషి చేయాలని సూచించారు. సబల్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో చేపడుతున్న భూ సంరక్షణ, ల్యాండ్ స్కేపింగ్ పనులపై సంస్థ ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టరు వివరించారు. పర్చువల్ విధానంలో పాడేరు ఐటిడి ఏపి.ఓ వి.అభిషేక్, రంపచోదవరం పి. ఓ కె.సింహచలం ఇతర అధికారులు పాల్గొన్నారు.

సచివాలయం సిబ్బంది సమయపాలన పాటించండి

ఎంపీడీవో ఉమామహేశ్వరరావు సూచన

విశాలాంధ్ర-జీకే వీధి : గూడెం కొత్తవీధి మండలం రింతాడ పంచాయతీ సచివాలయని శనివారం ఎంపీడీవో ఉమామహేశ్వరరావు సందర్శించారు. సచివాలయంలో ఉన్న రికార్డులు, సిబ్బంది హాజరు పట్టికను ఎంపీడీవో పరిశీలించడం జరిగింది. ఆయన మాట్లాడుతూ సచివాలయం సిబ్బంది సమయానికి విధులకు హాజరుకావాలని లేనిపక్షం చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అరుణ కుమార్, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాంట్రాక్ట్ కార్మికులు ఏజెన్సీల చేతుల్లో నలిగిపోతున్నారు

ఏఐటీయూసి రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు బుగత అశోక్

విశాలాంధ్ర-సాలూరు : ప్రభుత్వ ఆసుపత్రిలలో, వైద్యకళాశాలలో పని చేస్తున్న శానిటేషన్, పెస్ట్ కంట్రోల్, సెక్యూరిటీ గార్డులు, సూపర్వైజర్ మెదలగు కాంట్రాక్ట్ ఉద్యోగులు టి.వి.టి, స్కాట్లాండ్ ఏజెన్సీల చేతుల్లో నలిగిపోతున్నారని ఏఐటియుసి రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు బుగత అశోక్ అన్నారు. శనివారం ఉదయం సాలూరు ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులతో వెట్టిచాకిరి చేయించుకుంటున్న ప్రజారోగ్యశాఖలోని ఉన్నతాధికారులు కార్మికులకు పెరిగిన జీతాలను ఏజెన్సీ సంస్థలైన టి.వి.టి, స్కాట్లాండ్ కాంట్రాక్టర్ల చేత ఎందుకు ఇప్పించలేకపోతున్నారని ప్రశ్నించారు. రోగులకు ఇబ్బంది కలగకుండా ఉండాలని, ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఎంతో విపత్కర పరిస్థితులలో కూడా విధులు నిర్వర్తించే కాంట్రాక్ట్ కార్మికుల జీవితాలను గత ప్రభుత్వం దళారీ వ్యవస్థ చేతుల్లో పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీతభత్యాలు చెల్లించాలంటే ధర్నాలు చేసే పరిస్థితిని తీసుకువచ్చారన్నారు. ధర్నాలు చేయకపోతే పండగపూట కూడా వస్తులు ఉంచిన ఘనత గత ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. కూటమి ప్రభుత్వం కార్మికులను ఆదుకోవాలన్నారు.కాంట్రాక్ట్ కార్మికుల సేవలను గుర్తించి జీతభత్యాలను సకాలంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం జారీ చేసిన 549 జీవో ప్రకారం కాంట్రాక్ట్ వర్కర్స్‌కి 16 వేల రూపాయలు, జీవో నంబర్ 43 ప్రకారం సెక్యూరిటీ గార్డులకు 12,688 రూపాయలు చెల్లించా లన్నారు. గత ప్రభుత్వం కమీషన్లకి కక్కుర్తిపడి దళారీవ్యవస్థను ప్రోత్సహించడం వలనే వైసీపీ కార్మికలోకం గట్టిగా బుద్ధి చెప్పిందన్నారు. కార్మికుల భవిష్యత్ దళారీల చేతులలో పెట్టడం వలనే పెరిగిన వేతనాలు ఇవ్వకుండా కార్మికులను మోసం చేస్తున్నారన్నారు. మరల ఇప్పుడు కాంట్రాక్టర్ మారిన తరువాత దాదాపు 40 మాసాల నుండి పిఎఫ్,ఈఎస్ఐ ఎంత చెల్లిస్తున్నారో సూచించే వేతన పట్టికను చూపించకుండా నాటకాలు ఆడుతున్నారన్నారు. ఆసుపత్రిలో వార్డులు పెరిగినందున సరిపడా సిబ్బంది ని నియమించకుండా ఇప్పటికే ఉన్న వారితో వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని ఆరోపించారు. ఏఐటియుసి మన్యం జిల్లా ఉపాధ్యక్షురాలు, ఏపీ శ్రామిక మహిళా ఫోరం ఉమ్మడి జిల్లాల కన్వీనర్ బలగ రాధ మాట్లాడుతూ ప్రాణాలు పణంగా పెట్టి పనిచేస్తున్న కార్మికులకు పెరిగిన జీతాలు ఇవ్వకుండా కాంట్రాక్టర్లు ప్రవర్తించే తీరు బాధాకరమన్నారు. కార్మికులకు న్యాయం జరిగే వరకు ఏఐటీయూసి అలుపెరుగని పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మిక సిబ్బంది పాల్గొన్నారు.

షెడ్యూల్ ప్రకారం గ్రామసభలు నిర్వహించాలి : జేసీ శోభిక

విశాలాంధ్ర-పార్వతీపురం : పార్వతీపురం డివిజన్ పరిధిలో ముందుగా నిర్ణయించిన తేదీల ప్రకారం గ్రామసభలను నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక రెవిన్యూ అధికారులను ఆదేశించారు. డివిజన్ పరిధిలోని ఎనిమిది మండలాల అధికారులతో పార్వతీపురం రెవిన్యూ డివిజనల్ అధికారి కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఆమెసమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్వతీపురం డివిజనులో ముందుగా ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం పక్కాగా గ్రామసభలను నిర్వహించాలని అన్నారు. ఇప్పటికే జరుగుతున్న గ్రామసభల నిర్వహణపై ఆమె వివరాలు అడిగి తెలుసు కున్నారు. గ్రామాల్లో రీసర్వేపై చేపట్టనున్న గ్రామసభల గురించి ముందుగా రైతులకు సమాచారం అందించాలని అన్నారు. తద్వారా రైతులందరూ అందుబాటులో ఉంటారని చెప్పారు. గ్రామసభకు ముందు రెవిన్యూ రికార్డులన్ని సిద్ధం చేసుకోవాలని తెలిపారు. గ్రామాల వారీగా భూముల సర్వేపై ఆరా తీసిన ఆమె గ్రామసభల్లో రైతుల నుంచి ఫిర్యాదులను స్వీకరించాలని అన్నారు. ఈ క్రమంలో రైతుల నుంచి వచ్చిన అభ్యంతరాలను కూడా నమోదుచేసి, వాటిని సరిచేయాలని సూచించారు. అభ్యంతరాలు చేసిన రైతుల భూములను స్వయంగా పరిశీలించి, రీసర్వే పక్కాగా చేపట్టాలని అన్నారు. రెవిన్యూ రికార్డులు, రైతుల భూవివరాలు సరిపోయిన తదుపరి వాటిని ధ్రువీకరించాలని సూచించారు. రీసర్వేలో అలసత్వం, జాప్యం పనికిరాదని, నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని జేసీ హెచ్చరించారు. ఈసమావేశంలో పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోశ్ శ్రీవాస్తవ, డివిజన్‌లోని తహశీల్దార్లు, ఉప తహశీల్దార్లు, మండల, గ్రామ సర్వేయర్లు, గ్రామ రెవిన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఐటిడిఏ ప్రజావేదిక కార్యక్రమానికి కలెక్టర్ హాజరు కారు

విశాలాంధ్ర-సీతంపేట : ఈనెల 21న సోమవారం పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవం సంధర్బంగా ఆరోజు సీతంపేట, ఐటిడిఎలో నిర్వహించనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ హాజరుకావడం లేదని ఐటిడిఎ పీవో సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రీవెన్స్ కార్యక్రమం ఐటిడిఏ ఆధ్వర్యంలో యధావిధిగా జరుగుతుందని తెలిపారు. కావున ఈ విషయాన్ని గిరిజన ప్రజలు గమనించాలని పీవో కోరారు.

ఆర్.వెంకంపేట సచివాలయాన్ని ఎంపీడీఓ సందర్శన

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని ఆర్.వెంకంపేట గ్రామసచివాలయాన్ని ఎంపీడీవో పాండ్రంకి త్రివిక్రమరావు శనివారం ఆకస్మిక తనిఖీచేశారు. గ్రామంలో పారిశుద్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించడంతోపాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. అన్నిరకాల రికార్డులను సక్రమం గా నిర్వర్తించాలన్నారు. పల్లె పండుగ వారోత్సవాల్లో వచ్చిన ఫిర్యాదులను పరిష్కారం చేయాలన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కోసం ప్రభుత్వం పెద్దఎత్తున మంజూరు చేస్తున్నందున సిబ్బంది పనిచేస్తూ సకాలంలో పనులు జరిపించాలన్నారు ఈ కార్యక్రమంలో కార్యదర్శిలు రజని, శశిభూషణరావు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఎస్సై సంతోషికుమారి

విశాలాంధ్ర-పార్వతీపురం : పార్వతీపురం మన్యంజిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డిని పార్వతీపురం గ్రామీణ ఎస్సైగా నియమించబడి బాధ్యతలు చేపట్టిన సంతోష్ కుమారి శనివారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛమును అందజేశారు. అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించి మంచిపేరు తెచ్చుకోవాలని కోరారు. అనంతరం జిల్లా అదనపు ఎస్పీ డాక్టర్ దిలీప్ కిరణ్ ను కూడా ఎస్ఐ సంతోష్ కుమారి కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

ఏకలవ్య పాఠశాల ఇంచార్జ్ ప్రిన్సిపల్, వార్డెన్‌లకు షోకాజ్ నోటీసులు

విశాలాంధ్ర-సీతంపేట : ఐటిడిఏ పరిధిలోపాతపట్నం కేంద్రంగా కొనసాగుతున్న మెలియపుట్టి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో సీతంపేట మండలం వంబరెల్లి గ్రామానికి చెందిన సవర లావణ్య (12) ఇటీవల ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ విషయంలో పాఠశాల ఇంచార్జ్ ప్రిన్సిపల్, వార్డెన్‌లు సకాలంలో స్పందించక పోవడం, అలసత్వం వహించడం వంటి కారణాలతో ప్రిన్సిపల్ క్రిష్ణవేణి, వార్డెన్ నాగేశ్వరిలకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఐటిడిఎ పీవో సి.యశ్వంత్ కుమార్ రెడ్డి శనివారం తెలిపారు. అంతే కాకుండా శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు టెక్కలి ఆర్డీవో ను విచారణ అధికారిగా నియమించినట్లు ఈ సంధర్బంగా తెలిపారు.

యవగళం పాదయాత్రలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం వెంటనే అమలుచేయాలి

ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రవికుమార్ డిమాండ్

విశాలాంధ్ర-బెలగాం : నూతనంగా అధికారంలోకి వచ్చిన ఎన్డిఎ కూటమి ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉండగా రాష్ట్ర వ్యాప్తంగా యవగళం పాదయాత్ర చేస్తున్న సమయంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలు చేస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి. రవి కుమార్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఇప్పటికి 5 నెలలు పూర్తయిందని, కానీ ఇంకా ఆలస్యం చేస్తే డ్రాప్ ఔట్స్ పెరిగే ప్రమాదం ఉందన్నారు. విద్యార్థుల సంక్షేమం దృష్టిలో పెట్టుకొని త్వరగా జూనియర్ కళాశాల మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయాలని విద్యార్థుల పక్షాన ఎఐఎస్ఎఫ్ తరపున రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుచున్నామని లేనియెడల భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులను కలుపుకొని ఆందోళనా కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

పదేళ్ళ కులవివాదానికి హైకోర్టు తీర్పు తెర... న్యాయం గెలిచింది

మాజీ ఉపముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి

విశాలాంధ్ర-కురుపాం : తనపై చేసిన కులపరమైన ఆరోపణలన్నీ అవాస్తవమేననీ, న్యాయం గెలిచిందని, పదేళ్లుగా ఓవర్గం చేస్తున్న నిరాధార విమర్శలకు హైకోర్టు తీర్పే సమాధానం అని మాజీ ఉపముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి అన్నారు. హైకోర్టు తీర్పు అనంతరం ఆమె మాట్లాడుతూ కురుపాం నియోజకవర్గంలో తనతో 2019లో పోటీ చేసిన నిమ్మక జయరాజు, నిమ్మక సింహాచలం నేను ఎస్టీ కాదని హైకోర్టులో కేసు వేశారని ఇరువర్గాల వాదనలు విన్న కోర్టు పిటిషనర్ చేసిన ఆరోపణలపై ఆధారాలు లేకపోవడంతో కేసు కొట్టివేశారని తెలిపారు. జిల్లా స్థాయి కులనిర్ధారణ కమిటీ రిపోర్ట్, స్టేట్ స్క్రూటినీ కమిటీ ఇచ్చిన జీవో నెంబర్ 6ను పరిగణనలోకి తీసుకొని పుష్పశ్రీవాణి ఎస్టీ కులానికి చెందిన వ్యక్తి అని కోర్టు అభిప్రాయపడి ఎలక్షన్ పిటీషన్ కేసు కొట్టివేసిందన్నారు. ఎవరు ఎన్ని నిరాధార ఆరోపణలు, విమర్శలు చేసిన అంతిమ విజయం న్యాయానిదేనన్నారు. 10 ఏళ్లుగా ఒక వర్గం పుష్పశ్రీవాణి ఎస్టీ కాదని తప్పుడు ప్రచారం చేశారు. కానీ చివరికి న్యాయం గెలిచి కోర్టు కేసు కొట్టివేసిందన్నారు. ఈ కేసు 2019 ఎన్నికలకు సంబంధించిందని ఆ అసెంబ్లీ కాల పరిమితి 2024 సంవత్సరంతో పూర్తయినందున ఎటువంటి నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం లేదని కోర్టు స్పష్టం చేసిందని 10 ఏళ్ళుగా కుల వివాదానికి తెరపడిందని తాను న్యాయన్నీ నమ్మాననీ తన నమ్మకం ఒమ్ముకాలేదని ఆనందం వ్యక్తం చేశారు ...ఈసందర్భంగా కురుపాం నియోజకవర్గంలో ఐదు మండలాల నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

గాదెలవలస ఉన్నత పాఠశాలను దత్తత అధికారి ఏఓ సందర్శన

విశాలాంధ్ర-సీతానగరం: మండలంలోని గాదెలవలస జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను దత్తతఅధికారైన మండల వ్యవసాయ అధికారి ఎస్ అవినాష్ సందర్శించి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పలు అంశాలను తెలియ జేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శతశాతం ఫలితాలు సాధించాలని, వెనుకబడిన విద్యార్థులుపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎఫ్ 2 పరీక్షల్ల గూర్చి పాఠశాలలో విద్యా ప్రమాణాలు గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం మూడడ్ల శంకర్రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాల క్రీడలకు ఎంజెపి విద్యార్థులు ఎంపిక

విశాలాంధ్ర-కురుపాం : స్థానిక మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలలో చదువుతున్న 9వ తరగతి ఇద్దరు విద్యార్థులు శుక్రవారం రోజు జరిగిన చెస్ పోటీల్లో వసుపురెడ్డి నవీన్ అండర్ 14 సెలెక్టయ్యాడు.మరొక విద్యార్థి గేదెల శ్రీశాంత్ అండర్ 17కు సెలెక్ట్ అయ్యాడు పి ఈ టియు సత్యం, ప్రిన్సిపాల్ పి.సత్యనారాయణ, ఎస్ఎంసి చైర్మన్ డి.మణిపూర్ణరావు, మిగతా ఉపాధ్యాయులు నాన్ టీచింగ్ స్టాఫ్ ఇద్దరు విద్యార్థులను అభినందించారు.

రామవరం గ్రామ పరిధిలో విద్యుత్ సమస్యలు పరిష్కారం

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని రామవరం గ్రామపంచాయతీలో ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను, డామేజుడు పోల్స్ మరియు ప్రమాదబరిత వైర్లు తదితర సమస్యలను పరిష్కరించినట్లు విద్యుత్ శాఖ ఏఈ జగన్మోహనరావు తెలిపారు. ఈనెల 16న సీతానగరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో రామవరం సర్పంచ్ పెంట సత్యంనాయుడు గ్రామంలో ఎదుర్కొంటున్న పలు విద్యుత్ సమస్యలను సభలో లేవనెత్తగా వాటిని పరిష్కరించినట్లు ఆయన తెలిపారు. జనరల్ బాడీలో లేవనెత్తిన పలుగ్రామాల్లోని విద్యుత్ సమస్యలను కూడా పరిష్కరించడానికి కృషిచేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎంపిపి, ఎంపిడిఓ సూచనల మేరకు సర్వసభ్య సమావేశంలో తన దృష్టికి తెచ్చిన సమస్యలన్నింటిని పరిష్కారం చేస్తానని ఆయన విలేకరులు తెలిపారు.

చెత్త బుట్ట పెట్టలేదని సరికొత్త చెత్త పని

కెనరా బ్యాంక్ ముందు చెత్తపోసిన మున్సిపల్ పారిశుధ్య కార్మికులు

విశాలాంధ్ర-సాలూరు : పట్టణంలో సాలూరు పురపాలక సంఘం కార్యాలయానికి వెళ్లే దారిలో ఉన్న కెనరా బ్యాంక్ ప్రధానం ద్వారం వద్ద చెత్త పోసిన సంఘటన సంచలనం రేపింది.మధ్యాహ్న భోజన సమయంలో బ్యాంక్ ప్రధాన ద్వారం వద్ద పెద్దమొత్తంలో చెత్త ఉండటాన్ని సిబ్బంది చూసి బ్యాంక్ మేనేజర్ అనిల్‌కుమార్ తెలియజేశారు.వెంటనే చెత్త ను చూసిన మేనేజర్ ఎవరు చేసి ఉంటారని సిబ్బందికి ఆరాతీశారు.మున్సిపల్ పారిశుధ్య కార్మికులు వేశారని బ్యాంక్ బయట వేచిఉన్న మహిళలు చెప్పారు. వెంటనే మేనేజర్ అనిల్ తమ సిబ్బందితో కలసివెళ్లి మున్సిపల్ కమీషనర్ సత్యన్నారాయణ కు పిర్యాదు చేశారు.తమ పారిశుధ్య సిబ్బంది ఇటువంటి పనులు చేయరని ఎవరు చేశారో తెలుసుకోవటానికి పోలీసులకు పిర్యాదు చేయాలని సూచించారు.సిసి పుటేజీలో చూసి పిర్యాదు చేయవచ్చని బ్యాంక్ మేనేజర్ అనిల్ వెనుదిరిగారు.ఇంతలో మున్సిపల్ పారిశుధ్య ఉద్యోగులు చెత్తను తామే బ్యాంకు ఎదుట పోశామని విలేఖరులకు చెప్పారు.బ్యాంక్ వారు తరుచూ చెత్తని రోడ్‌పై పోస్తున్నారు. గతంలో జిల్లా కలెక్టర్ మున్సిపల్ కార్యాలయానికి వచ్చేటప్పుడు రోడ్‌పై చెత్త ఉండటాన్ని గమనించి మున్సిపల్ సిబ్బందిని హెచ్చరించారని తెలిపారు.అప్పటినుండి చెత్తబుట్ట పెట్టుకొని యూజర్ ఛార్జీలు చెల్లించాలని పలు దఫాలు బ్యాంక్‌వారికి సూచించిన పెడచెవిన పెడుతూ అనునిత్యం అధికమొత్తంలో చెత్తను రోడ్‌పై పారబోస్తున్నారని తెలిపారు.దీనికి నిరసనగా బ్యాంక్ వారు పారబోసిన చెత్తను అదే బ్యాంక్ గేట్ వద్ద వేశామన్నారు.చెత్త బుట్ట పెట్టాలని చాలా పర్యాయలు చెబుతున్నా బ్యాంకు వారు అలసత్వం ప్రదర్శిస్తున్నారని అటువంటి వారిపై ఇటువంటి చర్యలు చేపడితేనే మార్పు వస్తుందని పారిశుధ్య సిబ్బంది కమీషనర్ దృష్టికి తీసుకువెళ్లారు.వెంటనే కమీషనర్ బ్యాంక్ మేనేజర్‌తో మాట్లాడి చెత్తబుట్ట పెట్టి పారిశుధ్య కార్మికులకు సహకరించాలని లేనిచో అపరాధ రుసుం వసూలు చేస్తామని తెలియజేయగా చెత్త బుట్ట పెట్టి యూజర్ ఛార్జీలు చెల్లిస్తామని బ్యాంక్ మేనేజర్ అనిల్ కుమార్ కమీషనర్ కి తెలిపారు.మున్సిపల్ పారిశుధ్య కార్మికుల చర్యవలన బ్యాంక్ ఖాతాదారులకు శనివారం మధ్యాహ్నం కొంతమేరకు అసౌకర్యం కలిగిందని చెప్పవచ్చు.

భవిష్యత్‌లో ఇటువంటి చర్యలకు తావులేకుండా ఉండాలంటే చెత్తబుట్ట పెట్టి మున్సిపల్ కార్మికులకు బ్యాంక్ వారు సహకరించాలని పలువురు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

రైతుకు అధిక ఆదాయాన్ని సమకూర్చే మన్య ప్రాంత అనుకూల పంటలను ప్రదర్శించాలి

అధికారులు, శాస్త్రవేత్తలకు సహ సంచాలకులు అప్పలస్వామి సూచన

విశాలాంధ్ర-చింతపల్లి : వరి పంట కోత అనంతరం రబీ కాలంలో చలిని తట్టుకుని రైతుకు అధిక ఆదాయాన్ని సమకూర్చే మన్య ప్రాంతానికి అనుకూలమైన పంటలను ప్రదర్శించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని స్థానిక వ్యవసాయ పరిశోధనా స్థానం సహసంచాలకులు డాక్టర్ ఏ అప్పలస్వామి అన్నారు. అక్టోబర్ మాసానికి సంబంధించి నెలవారి శిక్షణ, సందర్శన కార్యక్రమాన్ని విశాఖపట్నం కి చెందిన ఆత్మ సహకారంతో స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహా సంచాలకులు డాక్టర్ ఎ అప్పలస్వామి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ వరి పంట కోత అనంతరం రాబోయే రబీ కాలానికి చాలా పొలాల్లో ఎటువంటి పంటలు వేయకుండా ఖాళీగా ఉంచడం అన్నది ఆనవాయితీగా వస్తుందనీ, ఈ ఆనవాయితీని మార్పు చేసి రైతుకు అధిక ఆదాయాన్ని సమకూర్చే దిశగా చలిని తట్టుకొని ఈ ప్రాంతానికి అనుకూలమైన పంటలను ప్రయోగాత్మకంగా పొలాల్లో ప్రదర్శించాల్సిన ఆవశ్యకత అధికారులు, శాస్త్రవేత్తలపై ఉందన్నారు. ఇందులో భాగంగా పరిశోధన స్థానంలోనే ఈ రబీ సీజన్లో ప్రొద్దుతిరుగుడు, శెనగ, గోధుమ వంటి పంటల సాగును పరిశీలించడం జరుగుతుందన్నారు. కార్యక్రమం లో పాల్గొన్న వ్యవసాయ అధికారులు తమ తమ ప్రాంతాల పంటల స్థితిగతులను వివరించారు. ఉద్యాన శాఖ అధికారి కర్ణ మాట్లాడుతూ తమ శాఖ ద్వారా నూతనంగా చేపట్టబోయే మామిడి, పైనాపిల్, డ్రాగన్, మిరియాలు, జీడి మామిడి పంటల సాగుకు ప్రభుత్వం వారు ఇచ్చే రాయితీ కార్యక్రమాలను వివరించారు. ప్రయోగాత్మక పరిశీలన కొరకై నంద్యాల పరిశోధన స్థానంలో ఆవిష్కరించిన ఎన్ బి ఇ జి 452 విత్తనాన్ని జీకే వీధి మండలం దామనపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు రైతులకు విత్తనాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ పి బాల హుస్సేన్ రెడ్డి, డాక్టర్ వెంకటేష్ బాబు, సందీప్ నాయక్, జోగారావు, పాడేరు ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ పి ప్రదీప్ కుమార్, అరకు వ్యవసాయ సహాయ సంచాలకులు మోహన్ రావు, చింతపల్లి వ్యవసాయ సహాయ సంచాలకురాలు జాహ్నవి, మండల వ్యవసాయ అధికారులు శ్రీనివాస్, మధు సూదన్ రావు, ఉమాదేవి, పాడేరు డి ఆర్ సి అధికారి విజయలక్ష్మి, ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ సభ్యులు, అధిక సంఖ్యలో గిరి రైతులు పాల్గొన్నారు.

ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం నిర్వహణ

విశాలాంధ్ర-బెలగాం : ఆదివాసి జాయింట్ యాక్షన్ కమిటీ పార్వతీపురం మన్యం జిల్లా శాఖ సమావేశం శనివారం స్థానిక గిరిజన భవన్ నందు నిర్వహించారు. ఈ సమావేశాన్ని గౌరవ ఛైర్మన్ నిమ్మక జయరాజు (మాజీ ఎమ్మెల్యే) అధ్యక్షతన పలు అజెండాలపై చర్చించి ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నవంబర్లో విడుదల చేయనున్న డిఎస్సీ 2024లో షెడ్యూలు తెగలకు సంబంధించి పోస్టులను ప్రత్యేక డిఎస్సీ ద్వారానే జరిపి న్యాయం చేయమని, ఈ విషయంలో గతంలో టిడిపి కూటమి ప్రభుత్వం అరకు మరియు కురుపాం ఎన్నికల ప్రచార సభలో ఎన్నికల్లో గెలవగానే త్వరలో ఎస్టీలకు ప్రత్యేక ఉద్యోగ నియమకాలు చేస్తామని టిడిపి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని గుర్తు చేస్తున్నామని తెలిపారు. అలాగే ఇటీవల పీసా గ్రామసభలు ఎన్నికలు జరుపుతామని షెడ్యూల్ విడుదల చేసి మరి, షెడ్యూల్ ప్రాంతాల స్వయంపాలనకు ఎన్నికలు వాయిదా వేయడం వెనుక ఉద్దేశం ఏమిటో తెలియజేయాలని, తక్షణమే పీసా ఎన్నికలు జరిపి స్వయంపాలనకు సంబంధించి నిర్ణయం తీసుకోవాలని, ఈ విషయాల్లో త్వరలో అన్ని నియోజకవర్గాల ఎస్టీ శాసనసభ సభ్యులకు మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి వారికి విజ్ఞప్తులు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. తదుపరి సకాలంలో నిర్ణయం తీసుకోని యెడల ప్రతి నియోజకవర్గ పరిధిలో రిలే నిరాహార దీక్షలు చేపట్టుటకు కూడా వెనకాడబోమని ఇందుమూలంగా తెలియజేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఛైర్మన్ కొండగొర్రి ధర్మారావు (రిటైర్డ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్), ఆరిక ధర్మారావు (రిటైర్డ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్), దుక్క సీతారాం (పార్వతీపురం), ఆరిక చంద్రశేఖర్, వాసు (జియ్యమ్మవలస), ఇంటికుప్పల రామకృష్ణ, హెచ్. అన్నాజీ (కురుపాం), రొబ్బ లోవరాజు, కె.రాఘవేంద్ర (జిఎల్ పురం), సాలూరు నుండి నిమ్మక అన్నారావు, మక్కువ నుండి మండల గిరిధరరావు, కొమరాడ నుండి మల్లయ్య, తాడంగి సత్యం, ఎం. త్రినాధ, వి. తిరుపతి, ఎ.నరేశ్, పి.అశోక్, ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్లు, కార్యనిర్వాహక సభ్యులు పాల్గొన్నారు.

మన్యప్రాంత అభివృద్ధికి, గిరిజనుల సంక్షేమానికి సహకరించండి

- నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అధికారులను కలిసి కోరిన ప్రజాప్రతినిధులు
- ఎంపీపీ అనూష దేవి, జడ్పిటిసి బాలయ్య, సర్పంచ్ పుష్పలత

విశాలాంధ్ర-చింతపల్లి : మండలంలో నూతనంగా నియమితులై బాధ్యతలు స్వీకరించిన మండల తహశీల్దార్ రవికుమార్, అటవీశాఖ డివిజన్ అధికారి వై వి నరసింహారావుని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించామని ఎంపిపి కోరాబు అనూష దేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్యలు అన్నారు. శనివారం వారు మాట్లాడుతూ రెవెన్యూకు సంబంధించి విద్యార్థులకు కులధృవీకరణ పత్రాలు త్వరితగతిన అందించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని, మ్యుటేషన్లు త్వరితగతిన పూర్తి చేయాలని, మ్యుటేషన్ల ప్రక్రియ పూర్తి కాకపోవడం వలన ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలు అర్హులైన గిరిజనులు పొందలేక పోతున్నారన్నారు. మ్యుటేషన్లు ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయడానికి కృషి చేయాలని కోరామన్నారు. తహశీల్దార్ సానుకూలంగా స్పందించి అన్ని పనులు త్వరగా పూర్తి చేయడానికి కృషి చేస్తానన్నారు. అనంతరం అటవీ శాఖ డివిజన్ అధికారితో మాట్లాడుతూ చింతపల్లి ప్రాంతం అన్ని కాలాల్లో పచ్చదనంతో కళ కళ లాడుతూ ఉండేదని పోడు వ్యవసాయం వలన అనేక అడవులు అంతరించి పోయి ప్రస్తుతం బీడు భూములు మిగిలాయన్నారు. ఆ బీడు భూములలో సిల్వర్ ఓక్ మొక్కలు నాటి అంతర్ పంటగా కాఫీ, మిరియాలు వేయడానికి గిరిజన రైతాంగం ముందుకు వస్తున్నారన్నారు. ఈ ఏడాది మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మైదాన ప్రాంతాల నుండి సిల్వర్ ఓక్ మొక్కలు దిగుమతి చేసి గిరిజన రైతులకు ఇవ్వడం జరిగిందన్నారు. తమ శాఖ ద్వారా ఈ ప్రాంతంలో నర్సరీలు పెట్టే గిరిజన రైతులకు సిల్వర్ ఓక్, టేకు, ఇతర మారు జాతి మొక్కలు సరఫరా చేయాలన్నారు. ఈ ప్రాంతంలో నర్సరీలు పెట్టడం వలన సకాలంలో మొక్కలు నాటే వీలుంటుందన్నారు. రవాణా ఛార్జీలు కూడా తగ్గి రైతుకు నాణ్యమైన మొక్కలు అందుతాయన్నారు. సానుకూలంగా స్పందించిన ఆయన మాట్లాడుతూ 2024-25 ఏడాదికి సంబంధించి సుమారు 6 వేలు మొక్కలు నర్సీల ద్వారా పెంచి గిరిజన రైతాంగానికి అందిస్తామన్నారు. కృష్ణాపురం ఏకో టూరిజం అభివృద్ధి చేసి పర్యాటకులను ఆకర్షించే విధంగా తీర్చి దిద్దుతామన్నారు. ఆ ప్రాంతానికి సమీపంలో ఉన్న గిరిజనులు సహకరించి లబ్ధి పొందాలన్నారు. కార్యక్రమంలో మండల సర్పంచుల పోరం అధ్యక్షురాలు దురియా పుష్పలత, ఎంపిటిసి సభ్యురాలు చిందాడ జయలక్ష్మి, మండల కోఅప్షన్ సభ్యుడు నాజర్ వల్లీ, వైకాపా మండల కన్వీనర్ సాంగి గణబాబు, వైకాపా సీనియర్ నాయకులు బూసరి కృష్ణారావు, గబులంగి మోహన్ రావు, వైకాపా జిల్లా ఉపాధ్యక్షుడు కంకిపాటి గిరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదారుల నూతన కార్యవర్గం ఎంపిక

విశాలాంధ్ర-వీరఘట్టం : మండలం యు.వెంకమ్మపేట పరిధిలో రైతు ఉత్పత్తి దారుల పరస్పర సహాయ సహకార సంగం లిమిటెడ్ (ఎఫ్ పి ఓ వీరఘట్టం) నందు జరిగిన వార్షిక సర్వసభ సమావేశం నందు నూతన కార్యవర్గంను ఎంపిక చేసుకోవడం జరిగినది దీనిలో నూతన కార్యవర్గంలో భాగంగా అధ్యక్షులుగా కరణం చిన్నంనాయుడు. (కంబర), ఉపాధ్యక్షులుగా చందక సత్తిబాబు (తలవరం), కార్యదర్శిగా కోట శంకరరావు, (వీరఘట్టం) ఉప కార్యదర్శిగా ఖండపు హరి, (హుస్సేనుపురం కోశాధికారిగా కొరికాన ఆసిరినాయుడు (వనస నందివాడ) ఎంపిక జరిగినది. ఈ కార్యక్రమంలో బోర్డు అఫ్ డైరెక్టర్‌లు, మండల వెలుగు ఏపీఎం కెల్ల రాము, సిసి ఆనంద్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జిల్లా మహిళా విభాగపు కార్యవర్గ సమావేశం నిర్వహణ

విశాలాంధ్ర-బెలగాం : ఎపిజెఎసి అమరావతి పార్వతీపురం మన్యం జిల్లా ఛైర్మన్ గొట్టాపు శ్రీరామమూర్తి, జిల్లా మహిళా విభాగపు ఛైర్పర్సన్ డి.సుష్మా పట్నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం పార్వతీపురం మన్యం జిల్లా మహిళా విభాగపు కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర మహిళా విభాగపు ఛైర్పర్సన్ పారె లక్ష్మి ప్రత్యేక అతిధిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎపిజెఎసి అమరావతి రాష్ట్ర ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు సూచనల మేరకు రాష్ట్ర మహిళా విభాగాన్ని బలోపేతం చేయుటకు, డివిజన్ స్థాయిలో మహిళా కార్యవర్గాన్ని ఏర్పాటు చేయుటలో భాగంగా జోన్-1లో పర్యటిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా విభాగపు ఛైర్పర్సన్ డి. సుష్మా పట్నాయక్ రాజీనామా చేయగా ఆమె స్థానంలో పార్వతీపురం తహసిల్దారు కార్యాలయంలో సీనియర్ సహాయకులుగా పనిచేస్తున్న టి. అరుణ కుమారిని ఛైర్పర్సన్ గా కో-ఆప్ట్ చేశారు. పార్వతీపురం డివిజన్ మహిళా విభాగపు కమిటీ ఛైర్పర్సన్‌గా డి.అపర్ణ (ఆర్టీసి), అసోసియేట్ ఛైర్పర్సన్ గా బి. హేమలత (మునిసిపాలిటి), కో-ఛైర్పర్సన్ గా బి. ప్రమీలరాణి (కో-ఆపరేటివ్), కో-ఛైర్పర్సన్ గా కె. దమయంతి (కో-ఆపరేటివ్), జనరల్ సెక్రటరీ గా ఎన్. సునీత (రెవిన్యూ), సెక్రటరీ-1 గా ఎస్. సింహాచలం (నీటి పారుదల), సెక్రటరీ -2 గా కె. కొండమ్మ (వైద్య ఆరోగ్య), కోశాధికారి గా ఎం. మంజూష (రెవిన్యూ) లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఎపిజెఎసి అమరావతి రాష్ట్ర మహిళా విభాగపు కో-ఛైర్పర్సన్ ఐ. విద్య, జిల్లా కార్యదర్శి డి.జి ప్రసాద్, వైస్ ఛైర్మన్ ఆర్. రమణమూర్తి, జిల్లా మహిళా విభాగపు సెక్రటరీ జనరల్ కె.వి భవాని, కార్యవర్గ సభ్యులు, మహిళా ఉద్యోగినులు పాల్గొన్నారు.

అంటిపేట లేఅవుట్ ఇళ్లను ఎంపిడిఓ పరిశీలన

విశాలాంధ్ర-సీతానగరం : లేఅవుట్‌లో ఇళ్లను త్వరితగతిగా పూర్తి చేసుకోవాలని ఎంపీడీవో త్రివిక్రమరావు పిలుపునిచ్చారు. శనివారంనాడు మండలంలోని అంటిపేట గ్రామ పంచాయతీలోని లేఅవుట్‌లో నాలుగు ఇల్లు మంజూరు కాగా వాటిలో ఎం.పద్మ, కోట శ్రీదేవిల ఇళ్లను పరిశీ లించారు. అక్కడే ఉన్న ఇంజనీరింగ్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్లకు పలు సూచనలు చేసి త్వరితగతిన నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

'వేంగడ' సీపీఎం పార్టీ శాఖ కార్యదర్శిగా సీవేరి కొండలరావు ఏకగ్రీవం

విశాలాంధ్ర-అనంతగిరి : వేంగడ పంచాయతీ సీపీఎం పార్టీ శాఖ కార్యదర్శిగా సీవేరి కొండలరావు ఏకగ్రీవంగా ఎన్నిక శనివారం వేంగడ పంచాయతీ సీపీఎం పార్టీ శాఖ 5వ మహాసభ జరిగింది ముఖ్య అతిథిగా సీపీఎం నాయకులు కిల్లో మోస్య టోకూరు సర్పంచ్ హజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం చెయడానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు ఇప్పటికే విద్యుత్ చార్జీల పంచి ప్రజల పై భారాలు వేసేందుకు ప్రభుత్వం సిద్ధ పడిందని తెలిపారు గిరిజన ప్రాంతాల్లో పిసాచట్టానికి విరుద్ధంగా మద్యం షాపులు గిరిజనేతరులకు కేటాయించారని గిరిజనేతరులకు కేటాయించిన షాపులు రద్దు చేసి గిరిజనులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం వేంగడ పంచాయతీ సీపీఎం పార్టీ శాఖ కార్యదర్శిగా సీవేరి కొండలరావు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు సీపీఎం పార్టీ బృందంలో కలిసి బందవలస కల్వర్టు పరిశీలించారు ఈ సందర్భంగా సీపీఎం వేంగడ పంచాయతీ సీపీఎం పార్టీ శాఖ కార్యదర్శి సీవేరి కొండలరావు మాట్లాడుతూ వేంగడ మెయిన్ రోడ్డు నుండి బందవలస మీదుగా మెటపాడు వరకు బీటీ రోడ్డు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు బందవలస కల్వర్టు నిర్మాణం నిమిత్తం ఎన్నో సార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని విమర్శించారు ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కల్వర్టు నిర్మాణానికి వేంటనే నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సవి అప్పన్న నందోలి సింహాద్రి దేముదు కొండబాబు సిహెచ్ అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన పెంచాలి

సిడిపిఓ అనంతలక్ష్మి

విశాలాంధ్ర-పాచిపెంట : బాల్య వివాహాల వలన కలిగే అనర్ధాలను వివరించి బాల్యవివాహాల ను నిర్మూలించే బాధ్యత మనందరిపై ఉందని పాచిపెంట ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ బి అనంతలక్ష్మి అన్నారు మండలంలో గల అమ్మ వలస గ్రామంలో శనివారం కిషోర్ బాలికలకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోషణ ఆరోగ్యం పరిశుభ్రత రక్తహీనత నివారణలో అంగన్వాడీలు భాగస్వామ్యం కావాలని అన్నారు ఈ సందర్భంగా ఆకుకూరలపై అవగాహన కల్పించి ఆకుకూరల వలన కలిగే ప్రయోజనాలను వివరించి వాటి ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ తెలియజేయాలని ఆమె అన్నారు. అలాగే మునగాకు అట న కలిగే ప్రయోజనాలను తల్లులకు తెలియజేయాలని కోరారు ఈ సందర్భంగా ఐరన్ టాబ్లెట్స్ పంపిణీ చేశారు హెచ్ బి టెస్ట్ నిర్వహించి టి హెచ్ ఆర్ పంపిణీ చేయడం జరిగింది అని తెలిపారు ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ సెక్టార్ పరిధిలో గల అంగన్వాడీలు పాల్గొన్నారు.

బొర్రా మోటార్ సభ్యులకు అవగాహన సదస్సు

విశాలాంధ్ర-అనంతగిరి : మండలంలో ప్రముఖ పర్యాటక కేంద్రం అయిన బోర్ర గుహలు మోటార్ యూనియన్ సభ్యులకు అనంతగిరి ఎస్సై డి శ్రీనివాసరావు పలు సూచనలు చేశారు. శనివారం జరిగిన ఈ సమావేశంలో బోర్ర ట్రైబల్ మోటార్ యూనియన్ అధ్యక్షులు దుంబరి శ్యామ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా అనంతగిరి సబ్ ఇన్స్పెక్టర్ డి. శ్రీనివాసరావు పాల్గొని యూనియన్ సభ్యులకు వాహన యజమానులకు ఆటో యూనియన్ సభ్యులకు పలు సూచన చేశారు. ముఖ్యంగా బోర్ర గుహల్ పర్యాటక ప్రాంతం కావడం వల్ల అనేకమంది పర్యాటకులు ఈ ప్రాంతానికి వచ్చి వెళుతుంటారని వారికి మనము గౌరవంగా, మర్యాదగా నడుచుకొని ఇక్కడినుంచి పంపించాలనే సూచించారు. అప్పుడే తరచూ పర్యాటకలో తాకిడి పెరుగు తుందని తెలిపారు. అలాగే ఇక్కడ నడుస్తున్న వాహనాలకు కచ్చితంగా అన్ని రికార్డులు ఉండాలని, డ్రైవర్ కు తప్పనిసరిగా లైసెన్స్ ఉండాలని తెలిపారు. అదేవిధంగా శాంతి భద్రతలకు విగాతం కలిగిస్తే చర్యలు తప్పవనీ తెలిపారు. గంజాయి, రంగురాళ్లు వంటి నిషేధిత వాటి జోలికి పోరాదని హెచ్చరించారు.

కాలువలో ఇసుక తీయడం వలన పంట పొలాలు కోతకు గురవుతున్నాయి

ఇసుక తవ్వకాలు నిలపాలని వట్టిభూసులు రైతులు ఆందోళన

గేదెల దేవమ్మ ఆవేదన

విశాలాంధ్ర-చింతపల్లి: కాలువలో ఇసుక తీయడం వలన కాలువను ఆనుకుని ఉన్న వ్యవసాయ పంట పొలాలు కోతకు గురవుతున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. వివరాల్లోకి వెళితే అల్లూరి జిల్లా చింతపల్లి మండలం, బెన్నవరం పంచాయతీ, వట్టిభూసుల గ్రామానికి చెందిన రైతులు గేదెల దేవమ్మ, గేదల సత్యనారాయణ, గేదెల విజయ్ కుమార్, గేదల భీమలింగం, గేదెల వీరభద్రం, గేదల అర్జున్‌ల పంట పొలాలు కాలువకు అనుకుని ఉండడంతో ఇసుక తవ్వకాలు చేయడం వలన పంట పొలాలు కోతకు గురవుతున్నాయని, దీన్ని దృష్టిలో ఉంచుకుని ఇసుక తవ్వకాలను తక్షణమే నిలుపుదల చేయాలని శనివారం వారు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ అధికారులకు ఎంత చెప్పినా పంట పొలాలు ఆనుకొని ఉన్న కాలువలో ఇసుక తవ్వకాలు నిలువరించలేకపోతున్నారని, ప్రతిఏటా ఇసుక తవ్వకాలు చేపట్టడం వలన తమ పంటపొలాలు కోతకు గురవుతున్నాయని, దీనివలన తామంతా నష్టపోతున్నామని రైతులు ఆవేదన చేస్తున్నారు. వెంటనే సంబంధిత ఉన్నత అధికారులు స్పందించి రైతులు పంట పొలాలు నష్టపోకుండా ఇసుక తవ్వకాలు నిలిపి వేసేందుకు చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేస్తామన్నారు.

గంగవరంలో భారీ అన్న సంతర్పణ

విశాలాంధ్ర-గంగవరం : మండల కేంద్రమైన గంగవరంలో శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసంతర్పణ జరిగింది. శరన్నవరాత్రి సందర్భంగా తొమ్మిది రోజులపాటు దుర్గాదేవి అమ్మవారు తొమ్మిది రకాల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చి శరన్నవరాత్రి అనంతరం భారీ అన్నసంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఈ భారీ అన్నసంతర్పణలో సుమారు 1000 మంది భక్తులు అమ్మవారి ప్రసాదం ఆరగించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఆలయ కమిటీ సభ్యులు కిషోర్, శేషా చార్యులు, ఉపేంద్ర, రమేష్, కురుసం. బుల్లి దొర,కె.సిద్ధు,సాయివెంకట్ నాయక్ సూరిబాబు పండు, తదితరులు పాల్గొన్నారు.

నూతన టెక్నాలజీతో సాంసంగ్ గెలాక్సీ ఏ16 5జి విడుదల

విశాలాంధ్ర-పాడేరు : భారతదేశంలో అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ అయిన సామ్‌సంగ్, ఈరోజు భారతదేశంలో గెలాక్సీ ఏ16 5జిని విడుదల చేసినట్లు వెల్లడించింది. దీని ప్రారంభ ధర రూ.18999. సరసమైన ధరలో వినియోగదారులకు అద్భుతమైన ఆవిష్కరణలను అందజేస్తూ, 6 తరాల ఓఎస్ అప్‌గ్రేడ్‌లు, 6 సంవత్సరాల భద్రతా నవీకరణలను అందించడం ద్వారా మధ్య-శ్రేణి స్మార్ట్‌ఫోన్‌ల కోసం భారతదేశంలో కొత్త ప్రమాణాన్ని గెలాక్సీ ఏ16 5జి నిర్దేశించనుంది. సామ్‌సంగ్ గెలాక్సీ ఏ16 5జి రెండు వేరియంట్‌లలో లభిస్తుంది-8 జిబి /128 జిబి మరియు 8 జిబి /256 జిబి. ఇవి గోల్డ్, లైట్ గ్రీన్, బ్లూ బ్లాక్ వంటి అధునాతన రంగులలో, ఈరోజు నుండి రిటైల్ స్టోర్‌లు, సాంసంగ్ డాట్ కామ్, అమెజాన్ డాట్ ఇన్, ఫ్లిప్కార్ట్ డాట్ కామ్ తో సహా ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లలో అందుబాటులో ఉంటుంది. అద్భుతమైన డిజైన్, పనితీరు సొగసైన మరియు ఆచరణాత్మకమైన స్మార్ట్ ఫోన్ గా సామ్‌సంగ్ గెలాక్సీ ఏ16 5జి రూపొందించబడింది.

ఫ్యూచర్-టెక్ స్కిల్స్‌లో సర్టిఫికెట్లు పొందిన సామ్‌సంగ్ ఇన్నోవేషన్ క్యాంపస్ విద్యార్థులు

విశాలాంధ్ర-పాడేరు : సామ్‌సంగ్ ఇండియా యొక్క ప్రతిష్ఠాత్మక సీఎస్ఆర్ ప్రోగ్రామ్, సామ్‌సంగ్ ఇన్నోవేషన్ క్యాంపస్, ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో ఉన్న గౌతమ బుద్ధ విశ్వవిద్యాలయంలో 400 మంది విద్యార్థుల కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కోర్సును ముగించింది. ఇది దేశానికి బలమైన భాగస్వామిగా ఉండాలనే బ్రాండ్ యొక్క నిబద్ధతను పునరుద్ఘాటించింది. దేశంలోని యువతను నైపుణ్యం అందించటం మరియు డిజిటల్ ఇండియాను శక్తివంతం చేయడం అనే దాని మిషన్‌లో భాగంగా ప్రభుత్వంతో కలిసి పని చేస్తోందని సామ్సంగ్ ప్రతినిధి అన్నారు. గౌతమ్ బుద్ధ విశ్వవిద్యాలయం, వైస్ ఛాన్సలర్, ప్రొఫెసర్ ఆర్.కె సిన్హా తో పాటు సామ్‌సంగ్ మరియు ఎలక్ట్రానిక్స్ సెక్టార్ స్కిల్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అధికారుల హాజరైన సన్మాన కార్యక్రమంలో విద్యార్థులకు సర్టిఫికేట్ లు అందజేశారు. సంవత్సరం పాటు జరిగిన ప్రోగ్రామ్ ముగింపులో భాగంగా, ప్రతి డొమైన్ నుండి టాపర్‌లకు రూ. 1 లక్ష నగదు బహుమతిని అందజేస్తారు మరియు ఢిల్లీ/ఎన్ సి ఆర్ లోని సామ్‌సంగ్ కేంద్రాలను సందర్శించే అవకాశాన్ని పొందుతారు.

సిబ్బందితో సమీక్ష సమావేశం

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా విఆర్ పురం ఎంపీడీవో గా నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన హెచ్. శశిభూషణరావు శనివారం కార్యదర్శులు సిబ్బందితో ముఖా ముఖి పరిచయం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధులు పట్ల అందరు అంకిత భావంతో పనిచేయాలనిఆదేశాలు ఇచ్చారు. ప్రజాప్రతినిధులు ప్రజలకు మధ్య మీరు వారధిగా ఉండి విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు విలేజ్ పోలీస్‌లు డిజిటల్ అసిస్టెంట్‌లు వెల్ఫేర్ అసిస్టెంట్లు సచివాలయం సిబ్బంది అగ్రికల్చర్ వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ నమోదు కార్యక్రమం : యుటిఎఫ్

విశాలాంధ్ర-అనంతగిరి : మండలంలో గల వివిధ ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల, ఎమ్మెల్సీ ఓటరు నమోదు అప్లికేషన్లను మండల శాఖ ఉమ్మడి జిల్లా పూర్వ సహాధ్యక్షులు శ్శెట్టి రాంబాబు యుటిఎఫ్ అనంతగిరి మండల శాఖ నాయకులు మండల కార్యదర్శి బిడ్డ సింహాచలం, సీనియర్ నాయకులు నరాజి మల్లేశ్వరరావు, గుజ్జెల దయానిది, మండ్య కేడ్ సుబ్బారావు నారాయణ రావు తో కలిసి నమోదు అప్లికేషన్లను తాసిల్దార్ కార్యాలయానికి అందించడం జరిగింది ఈ కార్యక్రమంలో శెట్టి రాంబాబు మాట్లాడుతూ నవంబర్ ఆరో తేదీ వరకు ఓటర్ నమోదు కార్యక్రమం ఉంటుంది కాబట్టి ప్రతి ఒక్క ఉపాధ్యాయులు నమోదు చేసుకోవాలని ఈ సందర్భంగా తెలియజేశారు.

ఎం.ఆర్.సి గ్రాంట్స్ మంజూరు పట్ల ఎంఈఓ-1 అసోసియేషన్ హర్షం

విద్యాశాఖ మంత్రికి కృతజ్ఞతలు

విశాలాంధ్ర-బెలగాం : రాష్ట్రవ్యాప్తంగా ఎంఈఓ కార్యాలయాల నిర్వహణ కొరకు మండల రిసోర్స్ కేంద్రాలకు రూ.8.82 కోట్లు నిధులు విడుదల చేస్తున్నట్లు విద్యాశాఖ మంత్రి లోకేష్ ప్రకటించడం పట్ల ఎంఈవో 1-అసోసియేషన్ ఎపి రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గత మూడేళ్లుగా ఎంఈఓ కార్యాలయాల నిర్వహణ నిధులు మంజూరు కాకపోవడంతో ఎంఈఓలు ఇబ్బందులు పడుతున్నారని ఎంఈవో -1 అసోసియేషన్ పక్షాన ఇటీవల విద్యా శాఖ మంత్రికి ప్రాతినిధ్యం చేయడంతో మంత్రి ప్రత్యేక చొరవ తీసుకుని ఎం.ఆర్.సీ నిర్వహణా నిధులు 50 శాతం విడుదల చేస్తున్నట్లు ప్రకటించడం పట్ల కృతజ్ఞతలు తెలియచేస్తున్నామన్నారు. అదేవిధంగా పాఠశాల నిర్వహణ గ్రాంట్లు కూడా విడుదల చేయడాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. ఇదే సందర్భంగా ఎంఈవోలు ఎదుర్కొంటున్న పలు ముఖ్యమైన సమస్యలపైన, విద్యా వ్యవస్థలో తీసుకు రావల్సిన సంస్కరణల పైన త్వరలోనే విద్యాశాఖ మంత్రిని కలిసి వివరిస్తామని రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం పేర్కొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

విశాలాంధ్ర-గంగవరం : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచితేనే వ్యాధుల పడకుండా ఉండవచ్చునని మండల ప్రత్యేక అధికారి రాఘవన్ అన్నారు. శనివారం ఆదేశాలతో నెల్లిపూడి గ్రామపంచాయతీ పరిధిలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం చేపట్టారు. ఈ పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా యాంటీ లార్వా స్ప్రేయింగ్ గ్రామమంతా చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకు కూరలతోనే ఆరోగ్యం : సీడీపీఓ నీలిమ

విశాలాంధ్ర-దుంబ్రిగూడ : ఆకు కూరలతో ఆరోగ్యకరంగా ఉండడానికి దోహదపడుతుందని స్థానిక సీడీపీవో నీలిమ అన్నారు. మండలంలోని ఆరుకు పంచాయతీ నేరుడువలస అంగన్వాడీ కేంద్రంలో మునగ, కరివేపాకు ప్రాదాన్యతపై గర్భిణులు, బాలింతలకు శనివారం ఆమె అవగాహన కల్పించారు. రోగనిరోధక శక్తిని పెంపొందించుకోవడానికి రోజు వారి ఆహార మెనూలో ఆకు కూరలతోపాటు మునగ, కరివేపాకు ప్రాధాన్యతనిస్తే ఆరోగ్యంగా ఉండవచ్చని ఆమె అవగాహన కల్పించారు. అనంతరం గుంటసీమ అంగన్వాడీ కేంద్రంలో సందర్శించిన ఆమె పోషకాహార పంపిణీపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీ : ఇరువురికి గాయాలు

విశాలాంధ్ర-దుంబ్రిగూడ : మండలంలోని ఆంధ్ర, ఒడిశా సరిహద్దు సొవ్వా పంచాయతీ గొప్పులవలసలో ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు. ఒడిశా రాష్ట్రం పుకలిలో జరిగిన వారపుసంతకు గసభ పంచాయతీ గొందివలస గ్రామానికి చెందిన వంతాల శ్రీను అనే గిరిజన యువకుడు సంత కెళ్తున్నారు. ఒడిశా నుంచి ఆంధ్రవైపూ బైకులో వస్తున్న గిరియువకుడు గొప్పులవలస సమీపంలో ఎదురెదురుగా బైకులతో ఢీకొన్నాయి. సంఘటన స్థలంలో బాధిత యువకులు చెల్లా చెదురుగా పడి ఉండడంతో స్థానికులు సఫర్యాలు చేశారు. ఒడిశాకు చెందిన యువకుడిని ఒడిశా ఆసుపత్రికి తరలించగా, గొందివలసకు చెందిన బాధిత గిరి యువకుడిని ఆంధ్రకు 108లో అరకులోయ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించి నట్లు స్థానికులు తెలిపారు.

గ్రామాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తొలి పండగ 'పల్లె పండగ'

విశాలాంధ్ర-చింతపల్లి :రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "పల్లె పండగ" ముగింపు కార్యక్రమం మండలంలోని తమ్మంగుల పంచాయతీ సుద్ధగరువు గ్రామంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆ పంచాయతీ ఎంపీటీసీ సభ్యుడు కే అప్పారావు ఆధ్వర్యంలో తెదేపా నాయకుడు భీమన్న అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి తెదేపా, జనసేన పార్టీలకు చెందిన మండల అధ్యక్షులు కిలో పూర్ణచంద్రరావు, వంతల బుజ్జి బాబు లతో కలిసి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆ పంచాయతీ సర్పంచ్ సలిమితి లక్ష్మయ్య సచివాలయ సిబ్బందితో కలిసి ముందుగా భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చే అమలుపరుస్తున్న " పల్లె పండగ " గ్రామాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తొలి పండగ అని అన్నారు. ఇటువంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని గ్రామాలను అభివృద్ధి పరచుకోవాలన్నారు. గ్రామ సభల తీర్మానాలు ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడం మంచి పరిణామం అన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిరుపయోగంగా ఉన్న ఎన్నో ఈ ప్రభుత్వంలో గ్రామసభల ద్వారా పరిష్కరించుకునేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పంచాయతీ ఉపసర్పంచ్ కే మల్లేశ్వర రావు, పంచాయతీ వార్డు సభ్యుడు శ్రీను, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ ప్రసాద్, టెక్నికల్ అసిస్టెంట్, వీఆర్పీలు, సచివాలయ సిబ్బంది, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

పార్వతీపురం : మండలంలోని సూడిగాంలో పల్లెపండుగ కార్యక్రమంను శనివారం నిర్వహించారు. గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్లు మండల టిడిపి ప్రధాన కార్యదర్శి గొరజాన చంద్రమౌళి తెలిపారు. పల్లె పండుగ వారోత్సవాలలో భాగంగా అన్ని గ్రామాల్లో పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున సిసి రోడ్లు బిటి రోడ్లు తదితర పనులు మంజూరు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పైల సూరిబాబు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని రామవరం జగ్గు నాయుడుపేట గ్రామాల్లో పల్లె పండుగ వారోత్సవాలు శనివారం జరిగినట్లు

మండల టిడిపి అధ్యక్షులు రామవరంసర్పంచ్ పెంట సత్యం నాయుడు, శ్రీనివాసరావు, జగ్గునాయుడుపేట టిడిపి నాయకులు రెడ్డి సింహాచలంనాయుడు, పెంట ఉమాలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ పాండ్రంకి త్రివిక్రమరావు పాల్గొని పలు కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. గ్రామాల్లో ఇంకుడు గుంతలు నిర్మాణానికి శంకుస్థాపనలు, ట్రెంచ్ కటింగ్, గోకులాలు నిర్మాణానికి శంకుస్థాపనలు చేస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు, టీడీపీ నేతలు ,సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కురుపాం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పల్లె

పండుగ కార్యక్రమాన్ని శనివారం ఎంపీడీవో జె ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించారు. పలుచోట్ల అభివృద్ధి పనులు కు మండల కన్వీనర్ కెవి కొండయ్య, మాజీ జిల్లా పరిషత్ కోఆప్షన్ మెంబర్ రంజిత్ కుమార్ నాయకో ,శంకుస్థాపన చేశారు. ఇక నుంచి గ్రామాల్లో అభివృద్ధి పరుగులు పెడుతుందని అన్నారు. సర్పంచ్ ఐ గౌరీశంకర్, ఈఓఆర్డీ రమేష్ ,మండల ఇంజనీరింగ్ అధికారి నాగేశ్వరరావు ,ఉపాదిహామీ ఎపిఒ పి.బావాజీ ,మాజీ సర్పంచ్ వెంపటాపు భారతి తదితరులు పాల్గొన్నారు.

15

సీతానగరం : పల్లె పండుగ వారోత్సవాలు మండలంలోని చెల్లం నాయుడువలస, బక్కపేట, రామవరం, కోట సీతారాంపురం,

తామరకండి, లచ్చయ్యపేట, ఆర్ వెంకంపేట గ్రామాల్లో శనివారం నిర్వహించినట్లు ఎంపీడీఓ పాండ్రంకి త్రివిక్రమరావు తెలిపారు. ఆయాగ్రామాల్లో ఇంకుడు గుంతలు నిర్మాణానికి శంకుస్థాపనలు, ట్రెంచ్ కటింగ్, గోకులాలు నిర్మాణానికి శంకుస్థాపనలు చేయడం జరుగుతుందని ఎంపీడీవో త్రివిక్రమరావు తెలిపారు. జిల్లా కలెక్టర్, జిల్లాఅధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వం నిర్దేశించిన విధముగా అన్ని గ్రామపంచాయతీల్లో ఈనెల 22 వరకు జరుగుతుందన్నారు. కార్యక్రమాలను ముమ్మరంగా ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉద్యోగస్తులు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల సారధ్యంలో పల్లె పండుగ వారోత్సవాల ద్వారా పనులకు శంకుస్థాపనలు చేయడమేకాక ఆయా గ్రామాల్లో సమస్యలను కూడా పరిష్కరించడం జరుగుతుందన్నారు. అన్ని శాఖల అధికారులు కూడా ఈకార్యక్రమంలో పాల్గొంటున్నారని తెలిపారు. రంగంపేట సచివాలయంలో జరిగిన కార్యక్రమాన్ని సర్పంచ్ పద్మ,శ్రీరాములు నాయుడు.రామకృష్ణ నాయుడు,ఫీల్డ్ అసిస్టెంట్ తిరుపతిరావు గ్రామప్రజలు.సచివాలయం సిబ్బంది పాల్గొనడం జరిగినది.

దుంబ్రిగూడ : గిరిజన గ్రామాల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే

సాధ్యమని టిడిపి మండల అధ్యక్షుడు తుడుము.సుబ్బారావు అన్నారు. మండలంలోని అరమ, పోతంగి, కొల్లాపుట్టు పంచాయతీల్లో పల్లెపండుగ కార్యక్రమం జరిగింది. లివిటిపుట్టులో భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గత ప్రభుత్వంలో అభివృద్ధికి దూరంగా ఉండాల్సిన పరిస్థితి గిరిజనులకు ఏర్పడిందని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో భాగస్వాములై అభివృద్ధి, సంక్షేమానికి ఊతమిచ్చుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలోసర్పంచి వెంకటరావు, ఎంపీటీసీ సభ్యురాలు గీత, కూటమి నాయకులు స్వామి, ఆనంద్, చినగెన్ను, సింహాద్రి, ఎంపీఎం సూరిబాబు, ఎన్ఆర్ఎజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ సింహాచలం ఫీల్డ్ అసిస్టెంట్లు శాంతకుమారి దలిమ్మ, వార్డ్ మెంబర్ కాంతారావు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రబీ సీజన్లో గులి రాగి విస్తీర్ణం పెంచాలి

వ్యవసాయ అధికారి తిరుపతిరావు

విశాలాంధ్ర-పాచిపెంట : రానున్న రబీ సీజన్లో చిరుధాన్యాల విస్తీర్ణంతోపాటుగా గులి రాజు విస్తీర్ణం పెంచి దిగుబడి కూడా పెరిగేటట్లుగా పనిచేయాలని వ్యవసాయ అధికారి కే తిరుపతిరావు అన్నారు. వ్యవసాయ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రకృతి సేద్య ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా చోడి పంట విస్తీర్ణం పెంచడానికి వరి మాగాణి లలో వరి కోతకు 15 రోజులు ముందుగా ఐదు కిలోల చోడి విత్తనాలను చల్లుకోవాలని అన్నారు.రైతులలో ఈ విధానాన్ని విరివిగా ముందుకు తీసుకెళ్లాలని అంతేకాకుండా దిగుబడి పెరగాలంటే గులి పద్ధతిలో చోడి పంట సాగు చేసే విధానాన్ని రైతులకు తెలియజేయాలని కోరారు. అంతేకాకుండా క్షేత్ర ప్రదర్శనలను కూడా ఏర్పాటు చేయించాలని సూచించారు .గులి రాగి పద్ధతిలో సాధారణం కంటే దిగుబడులు రెట్టింపు వచ్చే అవకాశం ఉన్నందున అతి సులువైన ఈ పద్ధతిని రైతుల వద్దకు అందరం కలిసి తీసుకు వెళ్లాల్సిన బాధ్యత ఉందని అన్నారు .ఒక ఎకరా గులి సోడి పద్ధతి లో పండించాలంటే ఒక కేజీ విత్తనం పొగాకునారుమడి లాగా తయారు చేసిన ఎత్తయిన నార్మల్ లో వేసి 10 లేదా 12 రోజుల వయసులో అడుగున్నర దూరంలో బాగా చదును చేసి దుక్కు చేసిన పొలంలో నాటుకుంటే ఎకరానికి 20 క్వింటాళ్ల పైగా వస్తున్నట్లు నిరూపితం అయిందని అన్నారు. ఈ విధానానికి అత్యంత ప్రాధాన్యత రైతులకు తెలియజేయాలని కేజీ 42 రూపాయల మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులకు తెలియజేయాలని కోరారు.

జీవో 117 రద్దుపై హర్షం : పిఆర్టీయు

విశాలాంధ్ర-బెలగాం : పాఠశాల విద్యకు విఘాతం కలిగించే జీవో 117 ను వచ్చే విద్యా సంవత్సరం నుంచి రద్దు చేయడానికి ప్రభుత్వం ముందుకు వచ్చినందుకు పిఆర్టీయు హర్షం వ్యక్తం చేస్తుందని పిఆర్టీయు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు అమరపు సూర్యనారాయణ, జిల్లా అధ్యక్ష,6 ప్రధాన కార్యదర్శులు వాలేటి తవిటి నాయుడు,కాగాన విజయ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గంట శశికుమార్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు రవికుమార్ హర్షం వెలిబుచ్చారు. ప్రతి ఉన్నత పాఠశాలలో రెండు మీడియంలు ఉండాలని అందుకు అనుగుణంగా ఇప్పటి నుండే మాధ్యమాలను విడదీసేటట్లు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని సూర్యనారాయణ కోరారు. విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉన్నప్పుడు మాత్రమే విద్యా ప్రమాణాలు మెరుగు పడతాయని పిఆర్టీయు నాయకులు తెలిపారు. ప్రతి శుక్రవారం ఉపాధ్యాయుల సమస్యలపై సమావేశం ఏర్పాటు చేయడం విద్యారంగ అభివృద్ధికి శుభసూచకమని, అందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కృషి అమోఘమని ముస్ముందు కూడా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని విద్యా శాఖ పై తనదైన ముద్ర వేయాలని వారు కోరారు.

ముందు జనం తరువాతే మనం

పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రామన్ని విజయవంతం చేయండి

యాబై వేల సభ్యత్వాలు పూర్తిచేయాలి

నియోజకవర్గ ముఖ్య నాయకులకు మంత్రి సంధ్యారాణి దిశానిర్దేశం

విశాలాంధ్ర-సాలూరు : కూటమి ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువయ్యేలా చేసే బాధ్యత మనందరిపై ఉందని మంత్రి సంధ్యారాణి అన్నారు. శనివారం సాయంత్రం తన క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్యనాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రతీవర్గం వారి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి అనేక సంక్షేమ పథకాలకు రూపకల్పన చేశారన్నారు. టిడిపి పార్టీ అభివృద్ధికి మారుపేరని చెప్పారు. ఐదేళ్లలో సాలూరు నియోజకవర్గం చరిత్రలో నిలిచిపోయేలా అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. నాయకులు అనేవారు ముందు ప్రజలు బాగోగులు చూడాలని అప్పుడు మాత్రమే నాయకుడికి విలువ లభిస్తుందని చెప్పారు. ముందుజనం తరువాతే మనం అన్న చందంగా ప్రతీ నాయకుడు ప్రజలకు ప్రాధాన్యత కల్పిస్తూ పార్టీకి ప్రభుత్వానికి మంచిపేరు తేవాలని కోరారు. విజయవాడలో ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన ప్రజాప్రతినిధుల సమావేశంలోని అంశాలపై చర్చించారు. ముఖ్యంగా 26వ తేదీ నుండి ప్రారంభమయ్యే సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతంగా నిర్వహించి 50 వేల సభ్యత్వాలు లక్ష్యంగా పెట్టుకొని పూర్తిచేయాలన్నారు. ప్రమాదవశాత్తు చనిపోయినవారికి ఇచ్చే పరిహారం రూ 2 లక్షలు నుండి5 లక్షలకు పెంచడం జరిగిందన్నారు. ప్రతీ గ్రామంలో సిసి రోడ్లు కాలువలు మంజూరు చేస్తూ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. దీపం పథకం ద్వారా దీపావళి నుండి ప్రతీ ఇంటికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేయనున్నామని తెలిపారు. ఏ ఎన్నికలలో అయిన పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మాజీ ఉపముఖ్యమంత్రి రాజన్నదొర ఇప్పటికీ తానే ఉపముఖ్యమంత్రి అన్న భ్రమలో ఉన్నారన్నారు. ఇసుక దందా, మద్యంకుంభకోణాలు భూదందాలు,చివరకి తిరుపతి వెంకన్నస్వామి దర్శన లేఖలను కూడా అమ్ముకున్న చరిత్ర వైకాపాది అన్నారు. అటువంటి వారు నీతి నిజాయితీ కలిగిన చంద్రబాబు నాయకత్వం లో క్రమశిక్షణ కలిగిన కార్తకర్తలగా పనిచేస్తున్న తమపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే ఆర్.పి.భంజ్‌దేవ్, సాలూరు, మక్కువ, పాచిపెంట, మెంటాడ మండలాల పార్టీ అధ్యక్షులు ఆముదాల పరమేష్, గుల్ల వేణు, పిన్నింటి ప్రసాద్ బాబు,మరియు పట్టణ పార్టీ అధ్యక్షుడు నిమ్మాది చిట్టి సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఉద్యాన వనాలను సద్వినియోగం చేసుకోండి : ఎంపీడీఓ

విశాలాంధ్ర-చింతపల్లి : 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా హార్టికల్చర్ ప్లాంటేషన్, గృహ నిర్మాణం 90 రోజుల పని దినాలకు సంబంధించి ఎంపీడీవో ఆశాజ్యోతి మండలంలోని చౌడుపల్లి పంచాయతీ, గాడిదలమెట్ట, గొయ్యిలమెట్ట గ్రామాలలో శనివారం గ్రామాల సందర్శన చేశారు. ఇందులో భాగంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాది హామీ పథకం ద్వారా 2024 - 25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన హార్టికల్చర్ ప్లాంటేషన్, సిల్వర్ ఓక్ ప్లాంటేషన్, హౌసింగ్ 90 రోజులు పనిదినాలకు సంబంధించి బీఎల్ లెవల్, ఆర్ఎల్ లెవల్‌లో ఎన్ని ఉన్నాయి, వాటికి పనిదినాలు పెట్టె విషయం లో పని పూర్తి చేసిన వారికి త్వరగా పనిదినాలు కల్పించాలని ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీఓ కే లక్ష్మీనారాయణమూర్తి, ఈ సి మధు, పంచాయతీ కార్యదర్శి శివ, గృహ నిర్మాణ శాఖ ఏఈ రమణ, పుష్కర్ ప్లాంటేషన్ సూపర్ వైజర్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి తనిఖీ

విశాలాంధ్ర హుంకుంపేట : మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి జామల్ బాషా శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రోగులను పలకరించి చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టోర్‌రూంను పరిశీలించి రికార్డుల ను తనిఖీ చేశారు. మందుల సరఫరాపై మండల వైద్యాధికారి సౌజన్య తో ఆయన చర్చించారు. అనంత రం బారాపల్లి గ్రామంలో ఇమ్యూనై జేషన్ కార్యక్రమంలో పాల్గొని గర్భి ణీ స్త్రీలు బాలింతలకు మరియు టిబి వ్యాధిగ్రస్తులతో మాట్లాడుతూ ప్రతిరోజు మందులు తప్పనిసరిగా వేసుకోవాలని, మందులతో పాటు పోషకాహారం, ఆరు నెలలపాటు నెలకు రూ.500 ఇస్తున్నారని వీటిని అందరూ సద్వినియోగం చేసుకోవా లని ఆయన అన్నారు. ఈ కార్యక్ర మంలో వైద్య సిబ్బందితోపాటు పిహెచ్ఎన్ ఎన్.జమ్మి , ఏఎన్ఎం లు సుశీల, గాయత్రి, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే పల్లెలు

విశాలాంధ్ర-ఎటపాక : గ్రామాల అభివృద్ధికే పల్లె పండుగ ఉద్దేశ మనీ అరకు పార్లమెంట్ కార్యదర్శి ముప్పా శ్రీనువాస్ పేర్కొన్నారు. ఎటపాక గ్రామ పంచాయితీ గ్రామాల్లో అభివృద్ధి పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ప్రజలు తమపై ఉంచుకున్న సమ్మకాన్ని ఒమ్ము చేయకుండా గ్రామాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. కూటమిఅధికారంలోకి వచ్చిన తరువాత మరిన్ని సంక్షేమ పథకాలు అమలవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కారం వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పీటీసీ గోడేటి రవికుమార్, మది నేని వెంకటేశ్వర్లు, ముత్యాలు, రమేష్, పసుపు లేటి రాంబాబు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విపత్తుల సమయంలో ముందస్తు నివారణ చర్యలతో సత్ఫలితాలు

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : విపత్తుల సమయంలో ముందస్తు నివారణ చర్యలు చేపట్టడం వల్ల నష్టాలను నివారించవచ్చని జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పంచాయతీరాజ్, రెవెన్యూ, వైద్య ఆరోగ్యశాఖ, గ్రామీణ నీటి సరఫరా విభాగం , ఎంపీడీవోలు, తహసిల్దార్ లతో యూనిసెఫ్ అధికారులతో కలిసి డిజాస్టర్ మేనేజ్మెంట్ ముందస్తు చర్యలు , వాటర్ శానిటేషన్, హైజిన్ (వాష్) కార్యక్రమాలు అమలుపై వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విపత్తుల నిర్వహణకు సమర్థవంతమైన కార్యచరణ ప్రణాళికలు అమలు చేస్తామని అన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు నివారణ చర్యలు చేపట్టి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం జరుగుతుందని అన్నారు. ప్రజలకు అవసరమైన తాగునీరు, నిత్యవసర సరుకులు, విద్యుత్ సదుపాయాలు సమకూర్తున్నామని అన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యశాల వైద్య సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. విపత్తులలో జిల్లా కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తామని అన్నారు. విపత్తులకు ఎక్కువగా గురయ్యే ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు మరియు సేవల ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు మరియు కమ్యూనిటీ-ఆధారిత విపత్తు సంసిద్ధత ప్రణాళికలతో సహా వాష్ సౌకర్యాల అత్యవసర పరిస్థితులను వేగంగా విస్తరించడానికి వ్యూహాలను అమలు చేయడం జరుగుతుందని చెప్పారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్లాన్‌లలో వాష్‌ని ఏకీకృతం చేస్తామన్నారు.జిల్లా విపత్తు నిర్వహణ ప్రణాళికల్లో వాష్‌ని నిర్ధారిస్తూ, స్పష్టమైన మార్గదర్శకాలతో వనరుల కేటాయింపు మరియు అమలు ఇంటర్ డిపార్ట్‌మెంటల్ కోఆర్డినేషన్ సహకారం సమర్థవంతమైన సమన్వయం మరియు సమాచార భాగస్వామ్యాన్ని నిర్ధారించడానికి ప్రభుత్వ విభాగాలు, స్వచ్ఛంద సంస్థలుమరియు స్థానిక సంఘాల మధ్య భాగస్వామ్యాన్ని బలోపేతం చేస్తామని అన్నారు. విపత్తు సంభవించే ప్రాంతాల్లో వాష్ సౌకర్యాలు మరియు సేవలను మెరుగుపరచడానికి వ్యూహాలను వివరించే సమగ్ర జిల్లా కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తామని అన్నారు. గ్రామాలలో గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. హాబిటేషన్లో అవసరాలను గుర్తించి మౌలిక సదుపాయాలను సమకూరుస్తామని చెప్పారు. గ్రామాలలో తాగునీటి సదుపాయాలు, పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి వరద బాధితులకు సహాయక చర్యలు అందిస్తున్నామని చెప్పారు. కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమస్యలను సేకరించి పరిష్కార చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమం: జిల్లా ఎస్పీ

విశాలాంధ్ర-పార్వతీపురం : పార్వతీపురం మన్యం జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలోరేపు సోమవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించడం జరుగుతుందని పార్వతీపురం మన్యం జిల్లాఎస్పీ ఎస్ వి మాధవ్ రెడ్డి తెలిపారు. ప్రజలకోసం ప్రాణాలు త్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సిబ్బందిని స్మరించుకుంటూ వారికి ఘనంగా నివాళులు అర్పించడం జరుగుతుందన్నారు. భారత్-చైనా సరిహద్దులోని ఆక్షయ్ చిన్ ప్రాంతంలో 16 వేల అడుగుల ఎత్తున రక్తము గడ్డకట్టే మంచు పర్వతాల మధ్యన ఉన్న వేడినీటి బుగ్గ (హాట్ స్ప్రింగ్స్) అమర జవానుల త్యాగాలకు ప్రతీకగా మనమధ్య నిలిచి ఉందన్నారు. అసువులు బాసిన పోలీసులను స్మరిస్తూ ప్రతి ఏడాది అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినముగా పాటించడం ఈ పవిత్ర స్థలము నుంచే ఆరంభమైనది.పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ సందర్భంగా పోలీసులు త్యాగాలు, విధినిర్వహణలో అమరులైన పోలీసులు త్యాగాలు మరువలేమని, వారిని స్మరించుకోవడం అందరి బాధ్యతన్నారు. నేర పరిశోధన, ప్రజలసంరక్షణలో పోలీసులు అజరామం. మనకళ్ళముందు నిత్యము ఏకష్టం కలిగిన ముందుకు గుర్తొచ్చేది పోలీసులే .ప్రపంచమంతా నిద్రలో ఉంటే పోలీసులు మేల్కొని శాంతి భద్రతల పరిరక్షణకు కాపలా ఉంటారు. పార్వతీపురం మన్యంజిల్లాలో అమరవీరులైన కీర్తిశేషులు ముద్దాడ గాంధీ, షేక్ ఇస్మాయిల్, బి శ్రీరాములు, సిహెచ్ చిరంజీవిరావులకు, తదితర అమరవీరులకు అశ్రునయన నివాళులు అర్పించడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో జిల్లాలోని ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, మృతి చెందిన అమరవీరుల కుటుంబ సభ్యులు కూడా పాల్గొంటారని తెలిపారు. పోలీస్ అమరవీరులకు జోహార్లు అర్పించేందుకు ఈ కార్యక్రమంలో జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బంది పెద్దఎత్తున పాల్గొంటారని ప్రజలు కూడా పెద్ద ఎత్తున పాల్గొని నివాళులు అర్పించాలని తెలిపారు. వారంరోజుల పాటు అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం

విశాలాంధ్ర-సీతానగరం : రోడ్డు ప్రమాదాల జరగకుండా అప్రమత్తంగా ఉండాలని, రహదారి నియమనిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్సై రాజేష్ పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం మండలంలోని బుద్దుపేట గ్రామంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణం అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. రోడ్డు నియమ నిబంధనలు పాటించి ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వాహనదారులు అతివేగంతో ప్రయాణం చేయవద్దన్నారు. మైనర్లు వాహనాన్ని తీయవద్దన్నారు. తల్లిదండ్రులు కూడా చిన్నారులకు ద్విచక్ర వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. దీంతోపాటు ఇటీవల కాలంలో పెరుగుతున్న సైబర్ నేరాలుపట్ల, మాదకద్రవ్యాల పట్ల కూడా అవగాహన కల్పించారు. సెల్ఫోన్ల ద్వారా కొత్తకొత్త యాప్లు డౌన్లోడ్ చేసి నష్టపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, యువత పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్దే ధ్యేయంగా పల్లె పండుగలు

విశాలాంధ్ర, జియ్యమ్మవలస: గ్రామాల అభివృద్దే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, దానిలో భాగంగా పల్లె పండగ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రమేష్ తెలిపారు. శనివారం మండలంలో కుందరతిరువాడ ,చింతలబెలగాం, పరజపాడు, కుదమ, తురకనాయుడు వలస గ్రామాల్లో కల్వర్టులు, సిసి కాలువలకు భూమి పూజలు చేశారు.పెద బుడ్డిడి గ్రామంలో సర్పంచ్ సీమల సుజాత ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలకు భూమిపూజ శంకుస్థాపన చేశారు. ఈకార్యక్రమంలో ఏపీఓ కలిశెట్టి శ్రీనివాస రావు గ్రామ కార్యదర్శి టీ. లక్ష్మణ రావు ఎంపీటీసీ రేవల్ల జ్యోతి శ్రీ టీడీపీ నాయకులు రేవల్ల సీతారాం నాయుడు గురాణ శ్రీరామమూర్తినాయుడు, రేవల్ల రామమూర్తి నాయుడు, బలిమి వెంకటరమణ, వంజరాపు దామోదర నాయుడు ,ఇంచార్జి వీఆర్ఓ తిరుపతిరావు, గ్రామ క్షేత్ర సహాయకులు వరహాల నాయుడు, టెక్నికల్ అసిస్టెంట్ అనంతరావు, జెఈ పార్థసాయిసతీష్ శశిబూషన్‌రావు, సచివాలయ సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

విధులపట్ల అంకితభావంతోనే గుర్తింపు : ఎంపీడీవో ప్రేమ్‌సాగర్

విశాలాంధ్ర-దుంబ్రిగూడ : విధులపట్ల అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు ఉంటుందని స్థానిక ఎంపీడీఓ ప్రేమ్ సాగర్ అన్నారు. పోతంగి పంచాయతీ సచివాలయ కేంద్రంలో ఆయన శనివారంసందర్శించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల చెంతకు చేరవేసే విధంగా తోడ్పాటునివ్వాలని ఆదేశించారు. సచివాలయంలో సందర్శించే గిరిజనుల పట్ల విక్షత లేకుండా వారి సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్, వీఆర్వో ఝాన్సీ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.